క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

మహేశ్వరం: నేడు (సోమవారం) మండల కేంద్రం ఎంపీడీఓ సమావేశం హాల్‌లో ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీతాఅంధ్యా నాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కేటీఆర్‌ను కలిసిన ఎల్‌బీనగర్ నేతలు



మంత్రి కేటీఆర్‌ను కలిసిన నేతలు

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కత్తుల రాంబాబు, నాగోలు డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవిలతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు శనివారం మంత్రిని కలిసి పూలమొక్కను బహుకరించారు.

వాహన తనిఖీల్లో రూ. 5 లక్షలు స్వాధీనం

నాగోలు: ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి రూ.5 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం చింతలకుంట చౌరస్తాలో ఎల్‌బీనగర్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. కొండకింది భాస్కర్ అనే వ్యక్తి కారులో నగదు రూ. 5 లక్షలు తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులు అతడి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఎన్నికల అధికారి ఎదుట హాజరు పరిచారు.

నేడు కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో..) టమోటా రూ.21, వంకాయ రూ.23, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 16, క్యారెట్ 37, దొండకాయ 18, ఆలుగడ్డ 22, ఉల్లిగడ్డ రూ.55, గోకరకాయ రూ.28, దోసకాయ 13, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.13, అరటి 09, చిక్కుడు 55, అర్వి 38, మునగ 85, చిలగడదుంప 45, బీట్‌రూట్ 25, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 75, కాప్సికమ్ రూ. 45గా ఉన్నాయి. ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పక్షవాతంపై అవగాహన

మన్సూరాబాద్: ప్రపంచ పక్షవాతం దినోత్సవం సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో చిత్రలేఅవుట్‌కాలనీలో పక్షవాతంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కామినేని హాస్పిటల్స్ న్యూరాలజిస్ట్ డాక్టర్ నవీన్‌కుమార్ హాజరై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పక్షవాతం సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై విపులంగా వివరించారు. వైకల్యం, మరణాలకు పక్షవాతం ప్రధాన కారణంగా ఉందని, వయస్సు పెరిగే కొద్దీ పక్షవాతం వచ్చే అవకాలున్నాయన్నారు. ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లో అత్యాధునిక పద్ధతుల్లో పక్షవాతానికి చికిత్స అందిస్తున్నామన్నారు.

చిన్నారులకు అరుదైన చికిత్స



ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులతో మాగ్నస్ వి ఆసుపత్రి వైద్య బృందం

చైతన్యపురి: పుట్టుకతో చెవిటి, మూగ చిన్నారులు నలుగురికి దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలోని మాగ్నస్‌వి ఈఅండ్‌టీ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ చేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన సిద్దార్ధ్ నాయక్ (5), నల్గొండకు చెందిన అభిరాంనంద్ (5), నంద్యాలకు చెందిన గౌశియా (4), ఈస్ట్ గోదావరికి చెందిన కార్తికేయ (7)లకు ఆసుపత్రి వైద్యులు సత్యకిరణ్, రవికుమార్, అనస్తీషియా నిపుణుడు జె.రవికుమార్, ఆడియాలజిస్ట్ నాగకిరణ్‌లు వీరికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీని పూర్తి చేశారు. రూ. 10 లక్షల ఖర్చు అయ్యే అరుదైన ఆపరేషన్‌ను ఉచితం అందించామన్నారు. మూడేళ్ల పాటు వారికి స్పీచ్ థెరపీ అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. పుట్టుకతో మూగ, చెవిటి పిల్లలకు, మధ్యలో వినికిడి లోపం వచ్చిన వారికి ఈ ఆపరేషన్ వల్ల వారి జీవితంలో వెలుగు నింపవచ్చన్నారు. చెవిటి, మూగ పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఏమాత్రం దిగులు చెందకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అందరి దృష్టి జల్‌పల్లిపైనే

- నియోజకవర్గం ఫలితం శాసిస్తుందన్న అంచనాలు
- 50 వేల పైబిలుకు ముస్లిం మైనార్టీల ఓట్లు



జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

పహాడీషరీఫ్: రంగారెడ్డి జిల్లాలో హాట్ సీట్‌గా మారిన మహేశ్వరం విజేతను జల్‌పల్లి మున్సిపాలిటీ ఓటర్లే ప్రభావితం చేస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది. నియోజకవర్గంలో రెండు జీహెచ్‌ఎంసీ డివిజన్లు, రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, రెండు మున్సిపాలిటీ(జల్‌పల్లి మినహాయిస్తే)లు, రెండు మండలాల్లో కొద్దోగొప్పో ప్రధాన పార్టీల నడుమ పోటాపోటీ ఉన్నప్పటికీ.. దాదాపు 50 వేలకు పైబడిన ముస్లిం ఓటర్లు కలిగిన జల్‌పల్లి మున్సిపాలిటీలో మాత్రం పరిస్థితి వేరుగా ఉందని అన్ని పార్టీలు ఓ అభిప్రాయంలో ఉన్నట్లు సమాచారం. జల్‌పల్లి మున్సిపాలిటీలో ఓట్లన్నీ మజ్లిస్-బీఆర్‌ఎస్ పరస్పర సహకారంతో బీఆర్‌ఎస్‌కే దక్కుతాయని అంచనాలు ఏర్పడ్డాయి. ఎట్టి పరిస్థితుల్లో చేజార్చుకోవద్దని బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తుండగా.. మిగిలిన పార్టీలు సైతం తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

ముస్లింల ఓట్లను దక్కించుకున్న సబిత

2018 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీ మజ్లిస్ సపోర్టుతో పోటీ చేసినప్పటికీ కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగిన సబితారెడ్డికి దాదాపు ఓట్లు పోలయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 57 పోలింగ్ బూత్‌ల పరిధిలో కొన్నింటిలో కాంగ్రెస్ ఆధిక్యం కనబరచగా.. మరికొన్నింటిలో బీఆర్‌ఎస్ ముందంజలో నిలిచింది. మున్సిపాలిటీ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్, కొత్తపేట, బాలాపూర్ పార్ట్(షాహిన్‌నగర్) గ్రామాల్లో దాదాపు 60 వేల ఓట్లకు గాను 23 వేల ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇందులో బీజేపీకి 1145, టీఆర్‌ఎస్‌కు 10956, కాంగ్రెస్‌కు 9094 ఓట్లు లభించాయి.

ముస్లిం ఓట్లపైనే నమ్మకం

మొన్నటి వరకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే వస్తుందని భావించిన బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఇక్కడి ఓట్లపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని నాలుగు గ్రామ పంచాయతీల్లో ఒక గ్రామ పంచాయతీ అయిన బాలాపూర్ గ్రామానికి 2006-2011 వరకు సర్పంచ్‌గా పనిచేసిన నేపథ్యంలో ఇక్కడి ప్రాంత ప్రజలతో ఉన్న సత్సంబంధాలు, కాంగ్రెస్‌కు అనాదిగా ముస్లింల ఓట్లు కూడా తోడవుతాయని భావించారు. కానీ, ఆమెకు సీటు దక్కని నేపథ్యంలో ఈ ప్రాంతానికి పరిచయం లేని తాజా కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్ ముస్లింల ఓట్లు ఎంత మేరకు రాబట్టుకుంటారన్న విషయం తేలాలంటే ఫలితాల వచ్చే ఆగాల్సిందే.

శ్రీరాం కాలనీ ఓట్లపై బీజేపీ ఆశలు

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంకాలనీలో పెద్ద ఎత్తున వలస వచ్చిన కర్నాటక, ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఓట్లు తమకే పడుతాయని బీజేపీ భావిస్తుంది. జల్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రమైన పాత గ్రామంలో కూడా తాము ఓట్లు తీసుకొని మిగిలిన పార్టీలకు ఏ మాత్రం తగ్గకుండా ముందుకు సాగుతామని ఆ పార్టీ అభ్యర్థి అందెల నమ్మకంతో ఉన్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి



ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకులు.

- విద్యాశాఖమంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా.. మిగిలిన అభివృద్ధి పనులు చేసేందుకు తనను మరోసారి ఆశీర్వదించాలని మంత్రి సబితారెడ్డి కోరారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బాలాజీనగర్ కాలనీలో ఆదివారం మంత్రి సబితారెడ్డి, యువనాయకులు కార్తిక్‌రెడ్డి సమక్షంలో బాలాజీనగర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్, వడ్డెర సంఘం నాయకులు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. బాలాజీనగర్‌లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారిని అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని తెలిసి పట్టాలు ఇప్పించానన్నారు. మొరంరాళ్ల మధ్య నడలేని ఈ ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానన్నారు. కృతజ్ఞతగా కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దండు గణేష్, కోఆప్షన్ ఖలీల్, భాస్కర్‌రెడ్డి, మహిళలు, పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాం : సబితారెడ్డి

బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని కొత్త మున్సిపల్ ఆఫీసు, లైబ్రరీ, స్టేడియం, స్కూల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, చెరువుల సుందరీకరణ, ట్రాక్‌లైన్, మెడికల్ కాలేజీ, లా కాలేజీ, రెండు డిగ్రీ కాలేజీలు, ఇంటర్ కాలేజీ, పాలటెక్నిక్ కాలేజీ, 450 పడకల హాస్పిటల్ , మరో 30 పడకల హాస్పిటల్ , 13 బస్తీ దవఖానాలు, 8 అర్బన్ ప్రైమరీ సెంటర్‌లు ఏర్పాటు చేశానన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి 54 కంపెనీలను తీసుకువచ్చి ఉపాధి కల్పించామని 13 రిజర్వాయర్లు మహేశ్వరంలో ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కాలనీలకు రోడ్లు, డ్రైనేజీ, వాటర్, విద్యుత్ అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, అన్ని కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

మైనార్టీల సంక్షేమమే లక్ష్యం

మహేశ్వరం: మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ మీనాజ్‌పటేల్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి తాను నిరంతరం కృషి చేశానని అన్నారు. మండల కేంద్రంలో మైనార్టీలకు 800 గజాల స్థలాన్ని కేటాయించి, రూ.10 లక్షల నిధులతో మైనార్టీ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈద్గా, దర్గా, మసీదుల అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చించి పనులు చేపట్టామన్నారు. మైనార్టీ యువతుల వివాహానికి షాదీముబారక్ పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎంఏ. సమీర్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, శివగంగ రాజ రాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుదీర్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు చంద్రయ్య, నవీన్, అబుబాకర్,ఎంఏ.సత్తార్, దావూద్, అదిల్ అలీ,అజమ్ పలువురు పాల్గొన్నారు.

సబితారెడ్డి గెలుపు కోసం పూజలు

కందుకూరు: మంత్రి సబితారెడ్డి మరోసారి విజయం సాధించాలని కోరుతూ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని లేమూరులోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబితమ్మ గెలవడం ఎంతో ముఖ్యమన్నారు. మెట్రోరైలు, మెడికల్ కళాశాల వంటివి రావాలంటే తప్పకుండా బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.పరంజ్యోతి, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఢిల్లీ గణేష్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, కిసాన్ సెల్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నా గెలుపునకు సహకరించండి

- కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి నివాసానికి వెళ్లి తమకు మద్దతు తెలిపి పార్టీ గెలుపునకు కృషి చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. పార్టీలో ఉన్న చిన్న చిన్న విభేదాలను పక్కన పెట్టి పార్టీ గెలుపు కోసం ముందుకెళ్దామని సూచించారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కృషిని గుర్తించి పార్టీ తగిన గౌరవం ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో ప్రతి నాయకుడు, కార్యకర్తను కలుపుకొని గెలుపు కోసం పని చేస్తామన్నారు. అంతకుముందు తన గెలుపు కోసం పని చేయాలని దేప భాస్కర్‌రెడ్డిని కోరగా తన అనుచరులతో మాట్లాడి, పార్టీ ఆదేశానుసారం నడుచుకుంటానని తెలిపారు.



దేప భాస్కర్‌రెడ్డిని కలిసిన లక్ష్మారెడ్డి

కాషాయం జెండా ఎగురడం ఖాయం



శ్రీరాములు యాదవ్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న నేతలు

- అందెల శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: డిసెంబర్ 3న మహేశ్వరం గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రం ఎస్ఎన్ గార్డెన్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. తుక్కుగూడ, సర్దార్‌నగర్, మన్సాన్‌పల్లి గ్రామాల్లో నిర్మించిన డబుల్ ఇళ్లను మంత్రి సబితారెడ్డి స్థానికులకు ఇవ్వకుండా పాతబస్తీకి చెందిన ముస్లింలకు పంపిణీ చేసిందన్నారు. మహేశ్వరాన్ని మరో పాతబస్తీగా మారుస్తుందని విమర్శించారు. మహేశ్వరంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు స్థానికేతరులు పోటీ చేస్తున్నారని, స్థానికుడినైన తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంతకు ముందు సుభాన్‌పూర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అందెల శ్రీరాములు యాదవ్

పార్టీ గెలుపు కోసం కృషి

తుక్కుగూడ : మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ కోరారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ఆపార్టీ ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు విస్తృతంగా బీఆర్‌ఎస్ కుటుంబ అవినీతి పాలన, కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం

దిల్‌సుఖ్‌నగర్: నియోజకవర్గంలో ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కు ఉందని బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల ఆరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెంద్యాల నగేష్, షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీంద్రరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితాఇంద్రారెడ్డికి మద్దతుగా ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ.. ఆపద వస్తే ఆదుకునే సబితా ఇంద్రారెడ్డిని గెలిపించుకుంటే ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీల కట్టు కథలు నమ్మొద్దని, పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేసే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే తిరిగి పట్టం కట్టాలని కోరారు. సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ ప్రజల జీవితాల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. సీఎం కేసీఆర్ అడగకముందే వరాలిచ్చే ప్రజలను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారని, అలాంటి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుంటే ప్రజల జీవితాలు మరింత బాగుపడుతాయన్నారు.



టెలిఫోన్ కాలనీ ప్రచారం చేస్తున్న నేతలు

విద్యార్థికి ఆర్థిక సాయం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రా లేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థి దాసరి మహంకాళి ఎంబీబీఎస్ కోర్సు చదువుకునేందుకు రుషిత తొడుపునూరి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సతీష్ ఆర్థికసాయం చేసేందుకు ముందుకొచ్చారు. గతంలో వచ్చి వార్తా కథనానికి స్పందించిన ఆయన ఆదివారం గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ సమక్షంలో దాసరి మహంకాళి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదివేందుకు రుషిత చారిటబుల్ ట్రస్టు తరపున రూ.25 వేల డబ్బును అందజేశారు. గత నెలలో మొదటి విడతగా రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనాథ విద్యార్థి గృహం ఒక అమ్మలా అనాథ, నిరుపేద విద్యార్థులకు ఆశ్రయమిచ్చి, అన్ని సౌకర్యాలూ కల్పించి, వారి భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. సహకరించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, గృహ సతీష్ అధ్యక్షులు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టండి

వనస్థలిపురం: తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలని, అవినీతిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ నియంత పాలనకు చరమగీతం పాడాలని ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఆదివారం వనస్థలిపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆదివారం హస్తినాపురంలో బూత్ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో మంత్రి కేటీఆర్ తన స్థానికత గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక్కడే పుట్టిన బిడ్డగా నాకెంత హక్కు ఉందో ఇక్కడకు వచ్చి నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ అంతే హక్కు ఉందన్నారు. మెదక్‌లో పుట్టి గజ్వేల్, కామారెడ్డి, సిరిసిల్లకు వెళ్లిన పారాషూట్లు కల్వకుంట్ల కుటుంబమన్నారు. ఉద్యమ సమయంలో సోదర తెలుగు ప్రజలను కేసీఆర్ బండ బూతులు తిట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. సోనియాగాంధీ ఆదేశాల ప్రకారం పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ చేయించింది తామేనన్నారు. జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు వజీర్ ప్రకాష్‌గౌడ్, యోగేశ్వర్‌రెడ్డి, సుజాతరెడ్డి, సదాశివుడు, లింగాల కిశోర్, సామ మహేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్

అధిష్టానం పునరాలోచించాలి



మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ టికెట్ విషయంలో పార్టీ అధిష్టానం పునరాలోచించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆదివారం యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డిలలో ఎవరికో ఒకరికి సీటు కేటాయించాలని పలువురు యువ నాయకులు కోరారు. స్థానిక నాయకులను కాదని నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తికి టికెట్ కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని ప్రజలు, నాయకులకు అండగా ఉంటానన్నారు. తాను పార్టీ పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు చేపట్టానని అదిష్టానం టికెట్ కేటాయింపులో పునరాలోచన చేయాలన్నారు.

నేతల్లో కొరవడిన సేవాభావం

- రాజకీయం వ్యాపారంగా మారింది
- విద్య, వైద్యం ఉచితంగా అందించే వారినే ఎన్నుకుంటాం
- 'సాక్షి' ప్రజా ఎజెండా చర్చాగోష్టిలో ఆటో డ్రైవర్ల స్పష్టీకరణ



మన్సూరాబాద్ కామినేని చౌరస్తా వద్ద ఆటోడ్రైవర్లతో చర్చాగోష్ఠి

మన్సూరాబాద్: నాటితరం రాజకీయ నేతలు సేవాగుణంతో ప్రజలకు సేవా చేసేవారు. నేటి రాజకీయ నేతలు రాజకీయాలను వ్యాపారంగా మార్చి ఓటును నోటుతో కొనుగోలు చేస్తున్నారు. ఉచితంగా విద్య, వైద్యం అందించే వారినే ఎన్నుకుంటామని మన్సూరాబాద్ ఆటో డ్రైవర్లు స్పష్టం చేశారు.

- మన్సూరాబాద్ కామినేని చౌరస్తాలోని ఆక్సిజన్ పార్కు, ఆటోస్టాండ్ వద్ద సాక్షి ఆధ్వర్యంలో 'ప్రజా ఎజెండా' పేరుతో ఆటో డ్రైవర్లతో చర్చా గోష్టి ఆసక్తికరంగా సాగింది.
- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే సత్తాతో పాటు ప్రజలకు సేవా చేయాలనే ఆసక్తి ఉన్న నాయకులను ఎన్నుకుంటామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక ఉపాధి అవకాశాలు సరిగ్గా లేక యువత ఆటోడ్రైవర్లుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నాయకులు జాప్యం చేస్తున్నారన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు రాజకీయ నేతలు ప్రాధాన్యమిస్తూ.. ఆటోడ్రైవర్లను చిన్నచూపు చూస్తున్నారని, ఆటోడ్రైవర్లు రాజకీయ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా విద్య, వైద్యం అందించేవారినే ఎన్నుకుంటాం



ఉచితంగా విద్య, వైద్యం అందించే రాజకీయ పార్టీ, నేతలనే ఎన్నుకోవాలనే నిర్ణయానికి వచ్చాం. ఎన్నికల సమయంలో హామీలిచ్చి ఓట్లు దండుకుని ఎన్నికల అనంతరం ప్రజా సమస్యలను పట్టించుకోని నేతల పట్ల అప్రమత్తంగా ఉంటాం. స్థానిక సమస్యలపై అవగాహన ఉండి పరిష్కరించే సత్తా ఉన్న నేతను ఎన్నుకుంటాం.

– నక్క మున్నా, ఆటోడ్రైవర్, బాలాజీనగర్

సంక్షేమానికి పాటుపడే నాయకుడికే పట్టం కడతాం..



ఆటోడ్రైవర్ల సంక్షేమానికి పాటుపడే నాయకుడికే పట్టం కడుతాం. డీజిల్, పెట్రోల్ రేట్లు విపరీతంగా పెరిగిన గత 8 ఏళ్లుగా ఆటో మిటర్ రీడింగ్ కనీస చార్జీలను పెంచలేదు. మూడు నెలలకు రూ.130 ఉన్న టాక్సీని ప్రభుత్వం రద్దు చేసింది. వాహనం ఇన్సూరెన్స్ రేట్లను మూడింతలకు పెంచారు.

– కదారి సిద్దులు, ఆటోడ్రైవర్, మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్

ప్రజలకు సేవ చేయాలనే తపన నాయకుల్లో లేదు



ప్రజలకు సేవ చేయాలనే తపన నేటితరం నేతల్లో లేదు. రాజకీయాలను వ్యాపారంగా మార్చి నోటుతో ఓటును కొనుగోలు చేయాలని నేతలు ఎన్నికల్లో ముందుకు వస్తున్నారు. ఇలాంటి నేతల పట్ల అప్రమత్తంగా ఉండి సరైన తీర్పును ఇస్తాం. ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎవరి కారణంగా అభివృద్ధి చెందుతుందో గుర్తించి వారికి ఓటును వేస్తాం.

– మోహనకృష్ణ, ఆటోడ్రైవర్, బాల్‌రెడ్డినగర్‌కాలనీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ నిస్వార్థంగా అందించే అభ్యర్థిని ఎన్నుకుంటాం. ఆటోడ్రైవర్లకు సమాజంలో సముచిత స్థానం కల్పించి, ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యమిచ్చే అభ్యర్థులకు ఓటు వేయాలనే నిర్ణయానికి వచ్చాం.

– సాయి, ఆటోడ్రైవర్, ఎరుకల నాంచారమ్మ బస్తీ